# ఈ అనుభవాల వెనక కథ

వేమూరి వెంకటేశ్వరరావు






మా నాన్నగారికి వయస్సు మీరిపోతూన్న రోజులలో నేను ఆయనని ఆయన జీవిత చరిత్రని సంగ్రహించి చెప్పమని ఒక సారి అడిగేను.

మా వంశవృక్షం తీసి ఇచ్చేరు.

ఇది కాదు. మీ జీవిత చరిత్రని మీ మాటల్లో చెప్పండి అని అడిగేను.

ఆయన చోడవరంలో చదువుకున్న రోజులతో మొదలు పెట్టి, కాకినాడలో స్కూలు ఫైనలు వరకు చదవటం, తర్వాత ఆయన ఉద్యోగాలు చేసిన ఊళ్ళు, ఆ ఉద్యోగంలో సంఘటనలు, ఆయన స్నేహితులు, వగైరా విషయాలన్నీ ఒక గంట సేపు చెప్పేరు.

నాకు ఆశ్చర్యం వేసినది ఏమిటంటే మా అమ్మ గురించి కాని, తన పిల్లల గురించి కాని, తన తల్లిదండ్రుల గురించి కాని ఒక్క ముక్క చెప్పలేదు - ఈ గంట సేపు చెప్పిన దాంట్లో.

ఇదే ప్రశ్న ఇదే విధంగా మా అమ్మని అడిగే అవకాశం నాకు రాలేదు. నా చరిత్ర ఏమిటి? నేనెవరు? మొదలైన ప్రశ్నలు వేసే కుతూహలం నాలో పుట్టే సరికి మా అమ్మ చచ్చిపోయింది. కాని మా చిన్నతనంలో మా అమ్మతో ఉన్న చనువు మా నాన్నగారితో ఉండేది కాదు కనుక మా అమ్మ చిన్నతనం గురించి తనంతట తను చెప్పిన కథలు ఎన్నెన్నో మాకు జ్ఞాపకం ఉన్నాయి. వాటిని బట్టి మా అమ్మ చిన్నతనం ఎలా ఉండేదో నేను ఊహించి చిత్రించగలను.

ఈ రకం చిత్రణ మా నాన్నగారి విషయంలో సాధ్యం కాదు. ఎందుకంటే మా నాన్నగారికి రెండేళ్ళు నిండకుండానే మా పితామహుడు స్వర్గస్తులయారు. అటుపైన ఆయన జీవితమంతా పొట్ట నింపుకునే పోరాటంతోనే తెమిలిపోయింది. బాల్యం అనే అవస్థ అనుభవించకుండానే ఆయన ఎదిగి పోయేరు.

ఈ విషయం తలుచుకున్నప్పుడల్లా నాకు నా జీవిత సంగ్రహం రాసుకోవాలనే కోరిక పుడుతూ ఉండేది. నేను భారత దేశంలో ఉండిపోయి, అమెరికా వలస రాని పక్షంలో నాకు ఇటువంటి కోరిక పుట్టి ఉండకపోను. పుట్టినా అక్కడ జీవిత పోరాటంలో పడి నేను రాసి ఉండేవాడిని కాదేమో! కాని నేను ఇప్పుడు అమెరికా వచ్చి స్థిరపడి పోయేను. అప్పుడే మన దేశంతో బంధాల పట్టు కొద్ది కొద్దిగా సడలిపోతూంది. రేపొద్దుట కాని, మరెప్పుడైనా కాని "మనం ఎవళ్ళం? ఎక్కడ నుండి వచ్చేం?" అని నా పిల్లలకి కుతూహలం పుట్టిన రోజున వారికి సమాధానం ఈ దేశంలో దొరకదు; ఇండియా వెళ్ళి పరిశోధన చెయ్యాలి. ఈ వెలితిని పూడ్చటానికి నా జీవిత సంగ్రహం ఒకటి రాయాలనే కోరిక మెదడులో మెదులుతూ ఉండేది.

ఊహలు చాలా మందికి పుడతాయి; కాని వాటిని ఆచరించేవారు బహు కొద్దిమందే ఉంటారు. దీనికి కారణం మానవుడికి సహజంగా ఉండే జంకు, భయం, బద్ధకం. ఈ పని చేసి ప్రయోజనం ఏమిటి? చెయ్యకపోతే వచ్చిన నష్టం ఏమిటి? జీవిత సంగ్రహం రాసేననే అనుకుందాం. ఎవరు చదువుతారు? నవ్వుతారేమో! మన గురించి అంతా చెప్పేస్తే నలుగురికీ మన గుట్టు తెలిసిపోతే ఎలా? మన జీవితంలో అనేకులు తారసపడతారు కదా! వారి గురించి ఏమని రాయాలి? మంచిగా రాయకపోతే కోపం రాదా? దులిపెయ్యరా? ఇలా సవా లక్ష ఆక్షేపణలు ఎదురవుతాయి. చూద్దాం లే అని పనిని బకాయి పెడతాము. నేనూ ఇటువంటి తర్జన భర్జనలు పడ్డవాడినే. ఇలా దరిదాపు పదేళ్ళ పైనే తటపటాయించేను.

ఒక సారి ఇలా తటపటాయిస్తూ ఉంటే పెమ్మరాజు వేణుగోపాలరావు గారు అన్నారు. "మీరు ఎవ్వరో చదువుతారనీ, మెచ్చుకుంటారని రాయొద్దు. మీ కోసం రాసుకోండి. ఇప్పుడు కాకపోయినా మరెప్పుడైనా మీ పిల్లలు చదువుకోవచ్చు. మీ పిల్లలకి తెలుగు రాదు కనుక ఇంగ్లీషులో రాసుకోండి," అని ఒక సలహా ఇచ్చేరు. అయినా రాయ బుద్ధి కాలేదు.

ఒక సారి రీడర్స్ డైజెస్టులో ఒక వ్యాసం చదివేను. ఆ వ్యాసకర్త అనేది ఏమిటంటే వయస్సు వచ్చిన తర్వాత జీవితంలో అనుభవాలు జ్ఞాపకం చేసుకుంటూ రాసుకుంటే పరిగెత్తే కాలం నెమ్మదించినట్లు అనిపిస్తుందిట. కనుక రాసుకోమన్నాడు. అది ఆరోగ్యానికి మంచిదన్నాడు. అయినా కాగితం మీద కలం పెట్టాలన్న కోరిక పుట్టలేదు.

అవి వర్డ్ ప్రోసెసర్లు వస్తూన్న కొత్త రోజులు. ఇంగ్లీషు కోసం తయారు చేసిన వర్డ్ ప్రోసెసరు ని ఉపయోగించి తెలుగులో రాయటం ఎలాగ అని మేమంతా ప్రయోగాలు చేస్తూన్న రోజులవి. అప్పుడు "యూనివర్సిటీ అఫ్ కేలిఫోర్నియాలో ఉన్న తమిళం నేర్పే ప్రొఫెసరు హార్టు గారి దగ్గర తెలుగు ఫాంట్లు ఉన్నాయి, అవి తెప్పించుకుని ఇంగ్లీషు వర్డ్ ప్రోసెసరు లో జొప్పించి వాడండి" అంటూ పిల్లలమర్రి రామకృష్ణ పిలచి చెప్పేడు. ఆ సలహా పాటించి హార్టు గారి దగ్గర పాతిక డాలర్లు పెట్టి ఆ ఫాంట్లు కొనుక్కుని ఆ ఫాంట్ల వాడకంలో ప్రావీణ్యత సంపాదించి నేను తెలుగులో రాసేవన్నీ ఆ పద్ధతిలో రాయటం మొదలు పెట్టేను.

హార్టు గారు ఇచ్చిన ఫాంట్లు అందంగా ఉండవు. వాడకం కూడా కష్టమే. కాని నాకు అప్పుడు అందుబాటులో ఉన్నది అదొక్క ఫాంటే. కనుక నేను సంకలించిన నిఘంటువుని ఆ ఫాంటులోనే కూర్చేను. నేను రాసే కథలనీ, కాకరకాయలనీ ఆ ఫాంటులోకి మార్చి కంప్యూటర్లో దాచుకున్నాను. ఇంతలో కెనడాలో ఉన్న తిరుమలకృష్ణ దేశికాచారి సరికొత్తగా పోతన ఫాంట్లు తయారు చేసేరు. అవి నా బర్కీ ఫాంట్లు కంటె అందంగా ఉన్నాయని వేణుగోపాలరావు గారు చెప్పి ఒక కాపీ పంపి నన్ను వాటి వాడకాన్ని సాధకం చెయ్యమన్నారు. సాధకానికి ఏదో ఒకటి రాయాలి కదా. ఏమిటి రాయాలో తోచక నా ఆత్మ కథ రాసుకోవటం మొదలు పెట్టేను. పోతన వాడకంలో ప్రావీణ్యత సంపాదించేసరికి నలభై, ఏభై పేజీల ప్రాప్తికి నా ఆత్మ కథ తయారయింది. మా వంశం పుట్టు పూర్వోత్తరాలు, మా నాన్నగారి చిన్నతనం, మా అమ్మ చిన్నతనం, ఇలా పదిహేడో శతాబ్దంలో మొదలుపెట్టి మా వంశవృక్షపు కూపీలు లాగి చాలామట్టుకు రాసేను.

అప్పటికే కె. వి. ఎస్. రామారావు గారు ఈమాట అనే పత్రిక స్థాపించి అందరికీ అందుబాటుగా ఉండే విధంగా అంతర్జాలం మీదకి సంధించి ఒదిలేరు. నేను రాసిన ఆత్మ కథ గురించి

ఆయనకి చెప్పి "మీ పత్రికలో వేసుకుంటారా?" అని అడిగేను.

"మీరు అమెరికా వచ్చిన తర్వాత కథ రాయండి. అదైతే అందరూ ఉత్సాహంగా చదువుతారు. మీకంతకీ మీ పాత కథ చెప్పాలని ఉంటే ఫ్లేష్‌బేక్‌లా వెనక్కివెళ్ళి అప్పుడప్పుడు ఒక మోతాదు చెప్పండి." అని సలహా ఇచ్చేరు.

ఆయన సలహా మేరకి నా అమెరికా ప్రయాణానికి నేను చేసిన సన్నాహాలని రాస్తే ఆయన ఈమాటలో ప్రచురించేరు. లేడికి లేచిందే పయనం అన్నట్లు నేను మొదలు పెట్టిన తర్వాత ఆప లేను. అమెరికా వచ్చిన కొత్తలో అనుభవాలని రాయటం మొదలు పెట్టేను. మళ్ళా అనుమానాలు, శంకలు, కుశ్శంకలు! ఏయే అనుభవాలని రాయటం? ఏవరెవరి గురించి రాయటం? అందరి గురించి మంచే రాయటమా? ఉన్నదున్నట్లు రాయటమా? నేను పడ్డ భయాలు, బెంగలు, అమ్మాయిలతో కలసి చేసిన అవకతవ పనులు, పొందిన పరాభవాలు, ప్రకృతిలో మార్పులు, ఇలా ఎన్నిటి గురించో రాయవచ్చు. ఇవన్నీ జరిగినవి జరిగినట్లు చెప్పటమా లేక చిలవలు, పలవలు అల్లి, రంగులద్ది చెప్పటమా? ఆఖరికి ఉన్నదున్నట్లు చెప్పటానికే నిశ్చయించి రాత మొదలుపెట్టేను. కలం - కలం ఏమిటి నా మొహం - కలం కాదు, కీబోర్డు మీద వేళ్ళు పరిగెత్తేయి.

ఇంత జోరుగా రాయగలుగుతానని అనుకోలేదు. నేను రాసినంత జోరుగానూ ప్రచురించకపోతే కథా గమనం యొక్క జోరు (tempo) తగ్గి పోతుంది. ఈమాట రెండేసి నెలలకి ఒకటి చొప్పున వస్తోంది కదా. అందుకని నెల నెలా వచ్చే సిలికాన్ ఆంధ్రా వారి సుజనరంజనిలో వేస్తారా అని కిరణ్‌ప్రభ గారిని అడిగేను. ఆయన సరే అన్నారు. దరిదాపు రెండేళ్ళ బట్టి ఈ వ్యాస పరంపర రాస్తున్నాను.

రాయటం అంటే రాస్తున్నాను కానీ జ్ఞాపకం ఉన్న వాటిలో వేటిని ఎంపిక చేసి చెప్పటం అనేది ఒక కొరకరాని సమస్యగా తయారయింది. ప్రతివారికి వారి జీవితంలో కొన్ని కొన్ని సంఘటనలు ముఖ్యం అనిపిస్తాయి. గుర్తున్నవన్నీ ముఖ్యం అని అనిపించకపోవచ్చు. కాలక్రమ వ్యత్క్రమణ జరగొచ్చు. లేదా, సందర్భ శుద్ధి కుదరక పోవచ్చు. కనుక నేను ఎంపిక చేసి రాసిన విషయాలు చదువరులని దృష్టిలో పెట్టుకుని ఎంపిక చేసినవి.

గమనించదగ్గ మరొక విషయం. ఒకే కాల పరిధిలో జరిగిన సంఘటనలని ఇంగ్లీషులో ఒక సారి, తెలుగులో ఒకసారి రాసి చూసేను. రెండింటికి పోలికే లేదు! ఇంగ్లీషులో రాస్తూన్నప్పుడు, తెలుగులో రాస్తూన్నప్పుడూ మనస్సులో మెదిలిన భావజాలాలే వేరు! ఇంగ్లీషులో రాస్తూన్నప్పుడు - అసంకల్పంగానే - అమెరికా పాఠకుడు నా మనస్సులో తిష్ఠ వేసుకున్నాడు. కనుక అమెరికా పాఠకుడు మన గురించి ఏమిటి తెలుసుకోవాలనుకుంటాడో ఊహించి అలా స్పందించి ఉంటాను. తెలుగులో రాసేటప్పుడు తెలుగు వారి కోసం రాసినట్లున్నాను. ఎందుకంటే ఎంపిక చేసిన సంఘటనలే వేరు! కథనం చెప్పే తీరే వేరు! కనుక మీరు ఇన్నాళ్ళూ చదివినవి అమెరికాలో నా 'తెలుగు' అనుభవాలు! అమెరికాలో నా 'ఇంగ్లీషు' అనుభవాలని ఇంగ్లీషులో ఒక కల్పిత కథ మాదిరి రాయటానికి ప్రయత్నిస్తున్నాను! అదెంతవరకూ వస్తుందో చూద్దాం.

గత రెండేళ్ళబట్టీ రాస్తూన్న ఈ కథ అయిపోలేదు కాని, ఇంతటితో ఈ కథని చెప్పటం ఆపేద్దామనే నిశ్చయానికి వచ్చేను. దీనికి కారణాలు అనేకం. ప్రతి నెలా క్రమం తప్పకుండా కథని అందించటం కొంచెం కష్టంగా ఉంది అని సాకు చెబితే అది అబద్ధమే అవుతుంది. రోజూ భోజనం,

వారానికోసారి తలంటి ఎలాగో అలాగే ప్రతి నెలా ఈ వ్యాసం అందించటం ఒక అలవాటుగా అయిపోయింది. కాని ఎంత మంచి కార్యానికయినా ముగింపు ఉండాలి. ఆ ముగించేదేదో ముందున్నప్పుడే ముగించటం మాన్యుల లక్షణం.

నేను యు. సి. ఎల్. ఎ. లో చదివిన నాలుగేళ్ళల్లో అమెరికాలో భారతీయుల జనాభా బాగా పెరగటం మొదలయింది కాబట్టి నేను ఇటుపైన చెప్పబోయే కథలో కొత్తదనం ఉండకపోవచ్చు. కనుక, ఇంతటితో వెల్లువలా వస్తూన్న ఈ ప్రవాహాన్ని ఆపి, వీలయినప్పుడల్లా చిన్న చిన్న సంఘటనలని గురించి రాస్తూ ఉంటాను.

ఇంతవరకు నేను రాసిన రాతలు బాగున్నాయంటూ పత్రికా ముఖంగా ఉత్తరాలు రాసిన చదువరులకి నా కృతజ్ఞతలు తెలుపుకుంటున్నాను. నా వయస్సుకి దగ్గరగా ఉన్న చాలా మంది ఈ వ్యాసాలు చదువుతూ ఉంటే వారి రోజులు కూడా జ్ఞాపకం వస్తున్నాయని నన్ను టెలిఫోనులో పిలచి పాత రోజులని పాత స్నేహాలని స్మరించుకుని సంతోషించిన వాళ్ళు కూడ ఉన్నారు. కనుక నేను పడ్డ శ్రమ వృధా కాలేదనే అనుకుంటున్నాను.

ఈ వ్యాసాలని ఒక పుస్తక రూపంలో ప్రచురించమని పలువురు సలహా ఇచ్చేరు. సొంత ఖర్చుతో పుస్తకాలు ముద్రించి వాటిని విక్రయించలేక నలుగురికీ ఉచితంగా పంచి పెట్టిన ప్రబుద్ధులలో నేనొకడిని. అందువల్ల దీనిని పుస్తక రూపంలో ముద్రించే సాహసం నాకు లేదు. వంగూరి సంస్థ వారు "మేము ముద్రిస్తాం" అంటూ నన్ను బెదిరిస్తున్నారు. చూద్దాం.

గత ఇరవై నాలుగు నెలలలో ఒకటి, రెండు సార్లు ఈ వ్యాస పరంపరని ఇక ఆపేద్దామని అనుకున్నప్పుడల్లా శ్రీ కిరణ్‌ప్రభ, ఆయన సహధర్మచారిణి శ్రీమతి కాంతి ఇంకా రాయమనే ప్రోత్సహించేరు. నేను రాసిన ప్రతిని తిరగ రాసి, సర్వాంగసుందరంగా తీర్చిదిద్ది పాఠకులకి అందించిన ఘనత మాత్రం శ్రీమతి కాంతి గారిదే ఆమె ఓర్పుకి హద్దులు లేవు.

శలవ్!
వేమూరి వేంకటేశ్వరరావు

